# డబ్బు డబ్బు

"ఒరేయ్ వీరేంద్రా! ఆ.... డబ్బు సంపాదించడం ఎలా?, డబ్బుని గుణించడం ఎలా? లాంటి గ్రంథాలు చదివి, ఊరికే కాలం వృధా చెయ్యక నాతో షాపుకి రా! ఇవాళ వ్యాపారంలో ఒక కొత్త రహస్యం నీకు చూపిస్తాను." అని బయలుదేరాడు వడ్డీకాసులయ్య. పుస్తకం పక్కన పారేసి బయలుదేరాడు వీరేంద్ర.

కాసులయ్య కళ్ళజోడు షాపు అంటే ఆ చుట్టుపట్ల తెగ ప్రసిద్ధి. ఏదైనా కొత్త మోడల్ మార్కెట్లోకి వచ్చింది అంటే, అది ఆయన షాపులోకే ముందు వస్తుంది అనేది అందరికీ తెలిసిన రహస్యం. ఏదైనా ఒక మోడల్ కళ్ళజోడు ఆయన షాపులో దొరకలేదూ అంటే, అది ఇక దేశంలో ఎక్కడా దొరకదు అని ప్రతీతి. ఎంతమంది పనివాళ్ళు వున్నా ప్రతి ఒక కస్టమర్‌నీ తాను స్వయంగా చూసుకుంటాడు అనేది ఆయన ప్రత్యేకత.

★ ★ ★

ఆ రోజు మధ్యాహ్నం దాకా మామూలుగానే సాగిన వ్యాపారం చూసి, వీరేంద్రకి బోరు కొట్టసాగింది. "ఏదో రహస్యం చెప్తానని, చెప్పడేమిటి ఈయన" అని తండ్రి మీద మనస్సులో విసుక్కోసాగాడు.

ఇంతలో ఎరుపురంగు మారుతి కారులోంచి, ఓ బడా మందుబాబు గారు దిగి, తాళం చెవులు తిప్పుకుంటూ, కళ్ళకున్న "ఫొటోగ్రే" అద్దాలు జేబులో పెట్టి, త్రిబుల్ ఫైవ్ సిగరెట్టు వెలిగిస్తూ, "లేటెస్ట్ మోడల్ ఏదైనా వచ్చిందా గురూజీ!" అని కాసులయ్య గారిని అడిగాడు. కాసులయ్య వీరేంద్ర కేసి, తిరిగి, "కూల్ డ్రింక్ ఒకటి తెప్పించు"

అని మందుబాబుగారి కేసి తిరిగి, "లోపలికి రండి సార్!" అంటూ వేరే ఓ చిన్న అద్దాల గదిలోకి తీసికెళ్ళి సోఫాలో కూర్చోబెట్టారు. బీరువా లాకర్ తెరిచి అందులోంచి ఓ కళ్ళజోడు బయటికి తీశాడు. మందుబాబు కళ్ళు జిగేల్‌మన్నాయి. వెంటనే కాసులయ్యగారు అందుకున్నాడు. "ఈ మోడల్స్ ఇండియాలో ఇంతవరకు రెండే రెండు వచ్చాయి సార్! క్రితం నెల ఢిల్లీలో జరిగిన మా సిల్వర్ జూబిలీ ఫంక్షన్ అసోసియేషన్ తరపున రాజీవ్‌గాంధిగారికి ఒకటి ప్రజెంట్ చేశాం సార్, ఇది రెండోది. నేను పట్టుకొచ్చాను చూడండి సార్" అంటూ ఆయన చేతికిచ్చారు.

కూల్‌డ్రింక్‌తో లోపలికి వచ్చిన వీరేంద్ర కొద్దిగా ఆశ్చర్యపోయాడు. ఈ మోడల్ అరుదైన మాట నిజమే కాని, రెండే రావడమేమిటి, అందులో ఒకటి రాజీవ్‌గాంధి కివ్వడమేమిటి– అని



మందుబాబుగారు అడిగాడు. "వాటిజ్ యిట్స్ కాస్ట్? ఎంత యిది?'

"ఎ..ని..మి..ది...వందలండి" చాలా జాగ్రత్తగా చెప్పాడు కాసులయ్యగారు.

"ఐసీ" అంటూ పర్సు తీశాడు మందుబాబుగారు.

"ఐ టూ సీ" అనుకున్నాడు వీరేంద్ర. ఎందుకంటే ఎంత ఎక్కువకి అమ్మినా దాని ఖరీదు ఆరొందలు దాటదు.

ఇంతలోకి కాసులయ్యగారు మళ్ళీ అందుకున్నాడు. "ఇప్పుడు నేను చెప్పింది ఒట్టి ఫ్రేమ్ ఖరీదే సార్! ఈ మోడల్‌కి అద్దాల ఖరీదు వేరే సార్!"

అదిరిపోయాడు వీరేంద్ర. నోట్లో వున్న సిగిరెట్ తాలూకు పొగ కళ్ళల్లోకి పోతూంటే, కళ్ళు సగం చిట్లించి "ఆహా! అదెంత! అదెంత?" అని అడిగాడు బాబుగారు.

"రెండొందలు సార్"! చెప్పాడు కాసులయ్యగారు.

వెంటనే వెయ్యి రూపాయిలు చేతిలో పెడుతున్న బాబుగార్ని చూసి కాసులయ్యగారు ఓ "వ్యాపారపు స్మైల్" చేసి క్షమించాలి. నేను చెప్పింది ఒక్కొక్క అద్దం ఖరీదు సార్! మీకు రెండూ కావాలి గదా!" అంటూ కంటి తుదల్లోంచి వీరేంద్రని చూశాడు.

"ఔను యస్" అంటూ మరో రెండొందలు చేతిలో పెట్టి వెళ్ళిపోతున్న మందుబాబుగారి చెవి దగ్గర కాసులయ్య వేసిన పూలతోట చూసి కళ్ళు తిరిగి పడిపోయాడు వీరేంద్ర. మందుబాబుగారు త్రాగడం మర్చిపోయిన కూల్‌డ్రింక్ వీరేంద్ర ముఖం మీద చిలకరించసాగాడు కాసులయ్య.